చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 8వ తేదీన చేపప్రసాదం పంపిణీ
- అప్పుడే పలు రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన ఆస్తమా రోగులు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 8వ తేదీన మృగశిరకార్తె ప్రారంభోత్సవ సమయంలో చేపప్రసాద పంపిణీకి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. బత్తిని కుటుంబికులు ప్రతి సంవత్సరం ఆస్తమా రోగుల కోసం పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని స్వీకరించేందుకు అప్పుడే పలు రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు తరలివచ్చారు. శనివారం ఉదయం 11 గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. శని, ఆదివారాల పాటు చేపప్రసాదం పంపిణీ జరపనున్నారు.


పలు రాష్ట్రాల నుంచి చేపప్రసాదం కోసం తరలివచ్చిన ఆస్తమా రోగులు

పలు శాఖల భారీ ఏర్పాట్లు..

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదాన్ని పంపిణీకి పోలీస్‌శాఖ, ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, మెట్రో వాటర్‌బోర్డు, తెలంగాణ విద్యుత్‌శాఖ, మత్స్యశాఖలతో పాటు పలు శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. బారికేడ్ల ఏర్పాట్లు, తాత్కాలిక షెడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. పలు రాష్ట్రాల నుంచి అప్పుడే వచ్చిన ఆస్తమా రోగుల కోసం హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా ప్రారంభించారు.

32 కౌంటర్లు ఏర్పాటు..

32 కౌంటర్ల ద్వారా చేపప్రసాదం పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చే వేలాది మందికి ఉచితంగా బత్తిని కుటుంబికులు ఆస్తమా రోగుల కోసం చేపప్రసాదాన్ని పంపిణీ చేస్తారు. మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను రూ.40 ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు. గురువారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కౌంటర్లను ఏర్పాటు చేసి చేప పిల్లల కోసం టోకెన్లను జారీ చేశారు.

భారీ బందోబస్తు..

ఎగ్జిబిషన్‌కు తరలివచ్చే వేలాది మంది ఆస్తమా రోగుల కోసం పోలీస్ శాఖ భారీ ఎత్తున బందోబస్తు చేపడుతుంది. అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లను ప్రారంభించారు. ఒక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసి అందులో పలు శాఖల అధికారులతో సమన్వయం చేపట్టి చేపప్రసాద పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. ఎగ్జిబిషన్ నలుమూలలా సీసీ కెమెరాల ఏర్పాటు, క్రైమ్ బృందాలు, షీ టీమ్‌ల ద్వారా బందోబస్తును చేపడుతున్నట్లు ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ ఆర్డీఓ మైహిపాల్‌రెడ్డి, నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

నేడు ఆహార పదార్థాల పంపిణీ

చార్మినార్: మృగశిర కార్తె సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం కోసం వచ్చే ప్రజలకు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయనున్నామని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు. గురువారం సాయంత్రం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఒక రోజు ముందుగానే నగరానికి చేరకున్న వారి సౌకర్యార్థం టీ, టిఫిన్‌లతో పాటు మధ్యాహ్నం భోజనం పంపిణీ చేయనున్నామన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి

నేడు ప్రత్యేక పూజలు..



చార్మినార్: ఆస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయడానికి బత్తిని కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేశారు. చేప ప్రసాదం తయారీలో భాగంగా ఈ నెల 7న ఉదయం 10 గంటలకు దూద్‌బౌలీలోని స్వగృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం, బావి పూజ కార్యక్రమాలు ఉంటాయని బత్తిని అనిరుద్ గౌడ్ తెలిపారు. పూజల అనంతరం బత్తిని కుటుంబ సభ్యులందరూ కలిసి అదే రోజు రాత్రి నుంచి చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. ఇక 8వ తేదీ ఉదయం ఇంట్లోనే తమ కుటుంబ సభ్యులందరం చేప ప్రసాదాన్ని స్వీకరించిన అనంరతం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలించి ఉదయం 11 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఏర్పాట్లు

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపప్రసాద పంపిణీకి అస్తమా రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తుందని మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గురువారం అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, మత్స్యశాఖ జాయింట్ కమిషనర్ శంకర్ రాథోడ్, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..లక్షల చేప పిల్లలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు ఈ నెల 8వ తేదీ శనివారం ఎగ్జిబిషన్‌లో చేపప్రసాదం పంపిణీ చేస్తారని వెల్లడించారు.


అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులలో 2024–25 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పారిశ్రామిక శిక్షణ సంస్థలోని వివిధ ట్రేడులలో చేరాలనుకునే అభ్యర్థులు తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు రిజర్వేషన్ల ప్రకారం.. ప్రవేశాల ప్రక్రియ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు విజయనగర్‌కాలనీలోని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్: https://iti.telangana.gov.in లో అప్లయి చేసుకోవచ్చు.

'ప్రజలకు అందుబాటులో ఉంటా'


కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న దేవర వంశీ తదితరులు

గోల్కొండ: తనను ఎన్నుకున్న ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీగా ఎన్నికైన సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ తన అనుచరులతో గురువారం ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మూడోసారి మళ్లీ ప్రధాని కావడం దేశానికే గర్వకారణమన్నారు. యువత కోసం గత పదేళ్లల్లో ప్రధాని మోదీ లక్షల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. రానున్న ఐదేళ్లల్లో ప్రధాని మనదేశాన్ని అగ్రదేశంగా తీర్చిదిద్దడం ఖాయమని ఆయన అన్నారు.

'బీజేపీకి తిరుగు లేదు'


కరీంనగర్ ఎంపీని సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: దేశంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కూడా బీజేపీకి తిరుగులేదని ఎన్నికల ఫలితాలు దీనిని స్పష్టం చేశాయని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎంపీగా ఎన్నికైన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని తెలంగాణ ఫలితాలు దీనిని రుజువు చేశాయని ఆయన అన్నారు. తన నియోజకవర్గం మల్కాజిగిరిలో సైతం సీఎం రేవంత్‌రెడ్డి కాపాడుకోలేకపోయారన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



జియాగూడ: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వ శాఖ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఏవీ.విజయరావు అన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు జి.నరేష్, శ్లోకా ది స్కూల్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్లోకా ది స్కూల్ ప్రాంగణంలో మొక్కలను నాటి సర్టిఫికెట్లు అందజేశారు. నెహ్రూ యువకేంద్ర హైదరాబాద్ అధికారి కుష్బు గుప్తా, శ్లోకా ది స్కూల్ డైరెక్టర్ రత్నేష్ జైస్వాల్, ఎం. తిరుమల్ రావు, బి.అన్వేష్, డైరెక్టర్, ప్రిన్సిపాల్, నాగేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ అమిత ఛరణ్, జి.జయ పాల్గొన్నారు.

సంగం మఠం వద్ద ఉద్రిక్తత

- రాంలీలా మైదానం స్వాధీనానికి పర్యాటక శాఖ యత్నం
- రెండు రోజులుగా సంగం వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తత

లంగర్‌హౌస్: బాపూసమాధి అభివృద్ధికి తమ స్థలాన్ని ఇస్తే, తమకు కాకుండా పూర్తిగా స్వాధీనం చేసుకొని వ్యాపారాలు చేస్తామంటే ఊరుకునేది లేదంటూ పర్యాటక శాఖ అధికారులపై స్థానికులు తిరగబడ్డారు. రెండవ రోజు కూడా అధికారులు సంగం వద్దకు వచ్చి కంచె వేసే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద త్రివేణి సంగంకు సంబంధించిన రాంలీలా మైదానం గురువారం జరిగిన సంఘటనతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి.

భూమి తమకు తిరిగి అప్పగించండి: పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా

రాంలీలా మైదానాన్ని పర్యాటక శాఖ అధికారులు స్వాధీనం చేసుకునే ప్రయత్నం విషయం తెలియగానే వివిధ పార్టీల నాయకులు, బస్తీల పెద్దలు, స్థానికులు త్రివేణి సంగం రాంచంద్రజీ మఠానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పాదయాత్రగా గోల్కొండ మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి స్థలాన్ని కాపాడాలంటు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో బాపూసమాధి అభివృద్ధి కోసం స్థలాన్ని అడిగితే తమకు కూడా మేలుకలుగుతుందని తమ పూర్వీక పీఠాధిపతులు ఒప్పుకొని ఎలాంటి డబ్బు ఆశించకుండా ఇచ్చారన్నారు. ఆ తర్వాత హోటళ్ల నిర్మాణాలు చేస్తామంటే తాము అడ్డుకున్నామన్నారు. ఇప్పుడు కంచె వేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామంటున్నారు. తాము కోర్టుకు వెళ్లి అయినా తమ భూమిని తాము తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, రాజు వస్తాద్, రఘుపాల్‌రెడ్డి, మాతంగి రమేష్, చంటి బాబు, రవీందర్ రెడ్డి ఉన్నారు.


సంగం మఠం వద్ద సమస్యను అడిగితెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

స్థలాన్ని కాపాడుకుందాం: ఎమ్మెల్యే కౌసర్

సంగం వద్ద గొడవలు తెలుసుకున్న ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ స్పందించి గురువారం సాయంత్రం సంగం మఠానికి చేరుకొని తాను న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..లంగర్‌హౌస్‌లో ఉన్న ఏకైక మైదానం రాంలీలా మైదనమని, శ్రీరామ నవమి, కార్తీక పౌర్ణమి, దసరా ఉత్సవాలతో పాటు దీపావళికి టపాసుల విక్రయాలు ఇక్కడే జరుగుతాయన్నారు. అంతే కాకుండా చారిత్రక సంగం శ్మశాన వాటికకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తారని, గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా ప్రముఖుల వాహనాలు ఇక్కడే నిలుపుతారన్నారు. ఇలాంటి స్థలాన్ని ఎట్టిపరిస్థితుల్లో వదులుకోమని తాను అండగా ఉండి రికార్డులు తెప్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా సేవకే జీవితం అంకితం


బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితం అని కాంగ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. గురువారం పాతబస్తీకి చెందిన రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్, తూంకుంట లహరి ఆధ్వర్యంలో ఆయనను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకురుమ మంగ, కొత్త కురుమ శివ కుమార్, రవి, మల్లేష్, ఎలమందా, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో 'బాలు పాట-మా నోట'


గంగపుత్ర నర్సింగ్‌రావును సన్మానిస్తున్న పలువురు గాయకులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మనీష కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాలు పాట-మా నోట అనే సంగీత కార్యక్రమాన్ని ఆయన గురువారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత గంగపుత్ర నర్సింహ మాట్లాడుతూ..ఎస్పీ బాలసుబ్రమాణ్యం సంగీత ప్రియుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కొనియాడారు. అంతకు ముందు పలువురు గాయని గాయకులు ఆలపించిన బాలు గీతాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్. ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ ఎస్.వెంకట్‌గుప్తా, నిర్వాహకులు, ఉమానేహ, ఎం.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి


అన్నదానంలో పాల్గొన్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొనాలని కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. అమావాస్య రోజును పురస్కరించుకుని గురువారం ఆయన రికాబ్‌గంజ్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని పేద ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల పాత్ర, ప్రాధాన్యత ఎంతో ఉంటుందన్నారు. ప్రతినిధులు పవన్, రాజ్‌కమల్, సునీల్, బాలాజీ పాల్గొన్నారు.

హిందీ భాషీయులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి


దీపాదాస్ మున్షీకి వినతిపత్రం అందజేస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: హిందీ భాషీయులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి లక్షలాది మంది హిందీ భాషీయులను ఆదుకోవాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా దాదాపు 50 లక్షల మంది ఉన్న నార్త్ ఇండియాకు చెందిన హిందీ భాషీయుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. న్యూఢిల్లీలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..గోషామహల్, బేగంబజార్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లోనే దాదాపు 15 నుంచి 20 లక్షల మంది హిందీ భాషీయులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులే మార్గదర్శకులుగా ఉండాలి

గోల్కొండ: పిల్లలకు వారి తల్లిదండ్రులే మార్గదర్శకులుగా ఉండాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురు యువ దంపతులకు పిల్లలు, వారి చదువుపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను చదివించడానికి ప్రైవేటు పాఠశాలలే కానవసరం లేదన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక స్తోమతను బట్టి పిల్లల చదువు కోసం స్కూల్‌లను ఎన్నుకోవాలని ఆయన సూచించారు. తమ ఆర్గనైజేషన్ అర్హులైన పేద పిల్లల ఉన్నత చదువుల కోసం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉన్నత చదవులతో పాటు హైస్కూల్ చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు తాము కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారు సరైన నిర్ణయాలు తీసుకునే విధంగా కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి సన్మానం


అసదుద్దీన్‌ను సత్కరిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడిగా మరోసారి ఎన్నికైన అసదుద్దీన్ ఒవైసీని తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..వాటర్‌బోర్డులో చిన్నాచితక కాంట్రాక్టర్లు ఉపాధి పొందే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో పదేళ్లపాటు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం అడ్డగోలుగా నిబంధనలను చేస్తూ వేలాది మంది కాంట్రాక్టర్లను రోడ్డుపాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్‌రాజ్, సీఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



నాంపల్లి: జవహర్ బాలభవన్‌లో వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు 45 రోజుల పాటు బాలబాలికలకు తర్ఫీదును ఇచ్చారు. ఆయా అంశాల్లో బాలబాలికలు నేర్చుకున్న అంశాలను గురువారం బాలభవన్‌లో ప్రదర్శించారు. విద్యార్థుల తల్లింద్రులు హాజరై తమ పిల్లల ప్రదర్శనలు చూసి తన్మయత్వం పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై చిన్నారులను బాలభవన్ డైరెక్టర్ విజయలక్ష్మి అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు బహుమతులను అందజేశారు. మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది కప్పరి కిషన్, వరలక్ష్మి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, రాజేశ్వరి, ముక్కంటేశ్వర్, జ్యోతి, లలిత, కుమారి, శైలజ, జనని పాల్గొన్నారు.


ప్రభుదత్తను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

జియాగూడ: ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్‌ల ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యకు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ గౌరవ అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, కూర జయరాములు గుప్తా అన్నారు. గురువారం జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో అమావాస్యను పురస్కరించుకుని ఆశ్రమంలో గల పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గో సేవా కార్యక్రమం, ఆశ్రమ మఠాధిపతి ప్రభుదత్త మహారాజ్‌కు సన్మానం నిర్వహించారు. వాసవీ సేవా కేంద్రం అధ్యక్షుడు కొల్పూరు రమేష్, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాయర్, కోశాధికారి నరేందర్, ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ అధ్యక్షుడు గుండ సురేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జగిని యాదగిరి గుప్తా, కోశాధికారి చిగుళ్లపల్లి గోవింద్‌గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ జె.ధనుంజయగుప్తా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: అమావాస్య పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గోల్కొండ కోటపై కొలువుదీరిన మహంకాళీ అమ్మవార్లకు గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి బి.సురేష్‌చారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో లక్ష్మణ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పల బాధలు భరించలేక ఆటోడ్రైవర్ అదృశ్యం


షకీల్ బషీర్ తానేఖాన్(ఫైల్)

చాంద్రాయణగుట్ట: అప్పుల బాధలు భరించలేక ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణారెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ పటేల్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ షకీల్ బషీర్ తానేఖాన్(29) ఈ నెల 3న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్యాంక్‌కు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తాను అప్పుల్లో కూరుకుపోయానని, టెన్షన్ భరించలేకపోతున్నందున ఇంటికి రాలేనంటూ మధ్యాహ్నం 1.19 గంటలకు తన భార్య ముబీనా బేగానికి సెల్ ఫోన్‌లో సందేశం పంపించాడు. దీంతో ఆమె వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మజ్లిస్ విజయం ప్రజా విజయం



గోల్కొండ: మజ్లిస్ పార్టీ విజయం ప్రజల విజయం అని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం కార్వాన్, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్‌లకు చెందిన పలువురు మహిళలు, మహిళా మజ్లిస్ నాయకురాలు టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి భారీ మెజార్టీతో అసదుద్దీన్ ఒవైసీ గెలిచిన సందర్భంగా వారు ఎమ్మెల్యేను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. మజ్లిస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించబడిందని మజ్లిస్ పార్టీ నుంచి మహిళలు కూడా ప్రజాప్రతినిధులుగా ఎంపికై ప్రజా సేవ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు రఫత్‌తో పాటు పలువురు మహిళలు ఉన్నారు.

గర్భిణులకు సురక్షితమైన ఆహారం అవసరం



అబిడ్స్: గర్భిణులకు సురక్షితమైన ఆహారం ఎంతో అవసరమని ఫెర్నాండెజ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ లతా శశి పేర్కొన్నారు. ఆసుపత్రిలో గర్భిణులకు సురక్షితమైన ఆహార చిట్కాలు వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ లతా శశి మాట్లాడుతూ..తల్లిగా మారాలనుకునే మహిళలు గ్యాస్ట్రోఎంటెరిటిస్, కామెర్లు, లూజ్ స్టూల్స్ వంటి అనారోగ్య సమస్యలను నివారించుకోవాలన్నారు. బయట భోజనాలను మానివేయాలన్నారు. పలు నియమాలు పాటిస్తే గర్భిణులు ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనిస్తారని పేర్కొన్నారు.

'పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు'



చార్మినార్: దేశ వ్యాప్తంగా బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించడంతో పాటు మూడో సారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ తిరిగి బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా దారుషిఫాకు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ పార్టీ అధిష్టానం అగ్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సీఎం డాక్టర్ అమ్మర్ రజ్వీ, మైనార్టీ సంక్షేమం, వక్ఫ్, హజ్ శాఖల మంత్రి దానిష్ ఆజాద్ అన్సారీ, ఉత్తర్‌ప్రదేశ్ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అలీ జైదీ తదితరులను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

కార్వాన్‌లో డీలాపడిన బీజేపీ

- ఉనికి చాటుకోలేకపోయిన బీఆర్ఎస్
- నామమాత్రపు ఓట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ ధాటికి ప్రతిపక్షాలు కుదేలయ్యాయి. రాష్ట్రంతో పాటు దేశంలో అబ్‌కీ బార్ చార్‌సౌ పార్ అనే నినాదంతో బీజేపీ దూకుడు మీద ఉండగా కార్వాన్‌లో బీజేపీలో ఆ దూకుడు ప్రచారంలో ఎక్కడ కానరాలేదు. భారీ బహిరంగ సభలు నిర్వహించడంలో కూడా బీజేపీ పూర్తిగా విఫలమైంది. పలువురు బీజేపీ సీనియర్ నాయకులు పార్టీలో, ప్రచారంలో తమకు సరైన ప్రధాన్యం ఇవ్వడం లేదంటూ చిన్నబుచ్చుకున్నారు. మహిళా ఓటర్లను కూడా తమ వైపు తిప్పుకోవడంలో బీజేపీ పూర్తిగా విఫలమైంది. బీజేపీ అభ్యర్థికి 59,722 ఓట్లు మాత్రమే రాగా మజ్లిస్ అభ్యర్థికి 108509 ఓట్లు వచ్చాయి. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కంటితుడుపుగా 3671 ఓట్లు మాత్రమే వచ్చాయి. మరోవైపు మజ్లిస్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ, మజ్లిస్ పార్టీలు కుమ్మక్కయ్యారని ఆరోపణలు వినవచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 11604 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఏదేమైనా మజ్లిస్ పార్టీ అభ్యర్థి గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కంటే ఈసారి సుమారు పది వేల ఓట్లు ఎక్కువ సాధించింది.